క్లుప్తంగా

క్లారినెట్ విద్యాంసుడు సుబ్బారావుకు సన్మానం




తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం నర్తనశాల చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం డాక్టర్ ఆనంద్ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం క్లారినెట్ విద్యాంసుడు కంచర్ల సుబ్బారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంచర్ల ఏడుకొండలు, కంచర్ల నాగభూషణం, కంచర్ల చంద్రశేఖర్, నక్కా యేసుదాసు, గోళ్ల ప్రభుదాసు, కూరపాటి సుదర్శన్, పెమ్మసానీ పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్ పాల్గొన్నారు.

'భవిత' కేంద్రంలో టీవీ ఏర్పాటు



తెనాలి: స్థానిక బాలాజీరావుపేటలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పాఠశాల 'భవిత' కేంద్రంలో బుధవారం టీవీని ప్రారంభించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దత్తత తీసుకున్న ఈ పాఠశాలలో పిల్లలకు డిజిటల్ ప్రోగ్రాంలపై అవగాహన కోసమని ఈ ఏర్పాటును చేశారు. తెనాలి జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి మాట్లాడుతూ ఏడాదిపాటు ఇంటర్నెట్ ఖర్చులను భరిస్తానని హామీనిచ్చారు. తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాస్, పర్యవేక్షకుడు, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు సునీల్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ వంపుగళ్ల కృష్ణ పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలకు మసీదులు ముస్తాబు



తెనాలిటౌన్: రంజాన్ పండుగ పర్వదినం పురస్కరించుకుని మండల గ్రామాల్లోని మసీదులను ముస్లింలు రంగులతో అలంకరించారు. మసీదులకు విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. కొలకలూరులోని మసీదు విద్యుత్ అలంకరణలో మెరిసిపోతోంది. అంజుమన్ కమిటీ సభ్యులు, పెద్దల సహకారంతో విద్యుత్ అలంకరణ చేశామని మసీదు నిర్వాహకులు తెలిపారు.

యువకుడిపై కేసు

తెనాలిరూరల్: మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ మండలం కోపల్లె గ్రామానికి చెందిన శశిప్రీతమ్ మంగళవారం రాత్రి గ్రామంలో బహిరంగంగా మద్యం తాగడమే కాకుండా కనిపించిన అందరితో గొడవలకు దిగాడు. రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లుకు సమాచారం అందడంతో గ్రామానికి వెళ్లి యువకుడిని అదుపులోకి తీసుకుని న్యూసెన్స్ కేసు నమోదు చేశారు.

విద్యుత్ వెలుగులు



మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు మక్కేవారిపేట విద్యుత్ కాంతులీనుతోంది. గతంలో చీకటిపడితే ఈ ప్రాంతం అంధకారంగా ఉండేది. ప్రజలు ఆ ప్రాంతానికి వెళ్లాలన్నా.. ఆ ప్రాంతం వారు బయటకు రావాలన్నా భయపడేవారు. సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే నవులూరు గోలివారితోట గాంధీబొమ్మ సెంటర్ నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేసి రోడ్డుకు బాబూ జగ్జీవన్‌రామ్ మార్గంగా నామకరణం చేశారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి రోడ్డు ఆర్పికి విద్యుత్ లైట్లు అమర్చడంతో గాంధీ బొమ్మ సెంటర్ విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

ఫిరంగిపురం: అంగన్‌వాడీ సహాయక పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రసూన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండాలపాడు బీసీ–2లో అంగన్‌వాడీ హెల్పర్, వేమవరం గ్రామకంద్రిక ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు అర్హులైన వారు ఈనెల 27లోగా ఫిరంగిపురం ప్రాజెక్టు కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని కోరారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన

- కుల, మత, వర్గ, పార్టీల భేదం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 9వ వార్డులో ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ఎటువంటి అవినీతికి తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 9వ వార్డు బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ నుంచి బుధవారం ప్రారంభించారు. 9వ వార్డు కౌన్సిలర్ వీరిశెట్టి వెంకట శివనాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు వీరిశెట్టి భాస్కర్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేయటం వల్ల ప్రజలు వాటిని ఆర్థికాభివృద్ధికి ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. అందుకే ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. 9వ వార్డులో 1517 ఇళ్లు ఉన్నాయని, వాటిలో 3659 మంది నివశిస్తున్నట్లు చెప్పారు. వార్డులో అర్హులైన వారికి రూ.36 కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు తెలిపారు. చేయుత 141 మందికి, ఆసరా 407, సున్నా వడ్డీ 515, విద్యాదీవెన, వసతి దీవెన 369, అగ్రిగోల్డ్ 84, అమ్మఒడి 318, రైతు భరోసా 259, పింఛన్ 485, ఇళ్ల స్థలాలు 433 మందికి ఇచ్చినట్లు వివరించారు. ఇవి కాకుండా రూ.53లక్షలతో వార్డులో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వార్డులో ప్రజలు రెండు సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించాలని కోరినట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సచివాలయానికి వచ్చే రూ.20లక్షల నిధులతో వాటిని నిర్మించనున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్లు గెడ్డేటి ఝాన్సీవాణి, అత్తోట నాగవేణి, కుర్రా సుజాత, గొడవర్తి సాయిహరేరామ్, తాడిబోయిన రామయ్య, యాతాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు, పేరం సంజీవరెడ్డి, 9వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.చిరంజీవి, టి.భరత్ కుమార్, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమష్టి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

- మోడల్ ఎఫ్‌పీఓగా శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంస్థ
- ఉత్పత్తిదారుల కలెక్షన్ సెంటర్, కోల్డ్ రూమ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



కలెక్షన్ సెంటరును ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: వాతావరణ అత్యవసర పరిస్థితి నివారణలో పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వ్యవసాయం మేలైన విధానాలని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఈ క్రమంలో ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ రైతులు సమష్టిగా ఉత్పత్తిదారుల సంఘంతో ముందడుగు వేయటం శుభసూచికమని, తద్వారా బహుళ ప్రయోజనాలు పొందగలరని అన్నారు. మండల కేంద్రమైన కొల్లిపరలో శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంస్థ నూతనంగా నిర్మించిన కలెక్షన్ సెంటర్, సోలార్ ఆధారిత కోల్డ్ రూమ్‌ను ఎమ్మెల్యే శివకుమార్ బుధవారం ప్రారంభించారు. సభకు జిల్లా ఉద్యాన అధికారి ఎస్.సుజాత అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, సాంకేతిక విజ్ఞానం ఆసరాగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ, ఉత్పత్తుల సొంత మార్కెటింగ్ చేయటం లాభదాయకం కాగలదన్నారు. ప్రయోగాలకు వెనుకాడని అభ్యుదయ రైతులతో కూడిన శ్రేష్ట ఫామ్స్ ఒక రోల్‌మోడల్ కాగలదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. రైతు శ్రేయస్సును కోరుకునే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం, తగిన మౌలిక సదుపాయాలతో అండగా ఉంటుందని హామీనిచ్చారు. ఏపీ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ డైరెక్టర్ త్రివిక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని, గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్‌ను తీసుకొచ్చినట్టు తెలిపారు. ఆసక్తిగల రైతులు ఈ దిశగా కృషి చేయగలిగితే ప్రభుత్వం అక్రిడిటేషన్, సర్టిఫికేషన్‌ను ఇస్తుందని చెప్పారు. శ్రేష్ట ఫామ్‌కు సాంకేతిక సహకారం అందిస్తున్న నెర్ల నరేంద్రరెడ్డి (విశాఖ) తన ప్రసంగంలో పదేళ్లుగా తమ కల, మంచి రైతు బృందంతో శ్రేష్ట ఫామ్ రూపంలో ఇప్పటికి ఆచరణలోకి వచ్చిందన్నారు. అగ్రిటెక్ రంగంలో పనిచేస్తున్న తాము, రైతుల ఇన్‌పుట్ ఖర్చును తగ్గించేలా తోడ్పడతామని తెలిపారు. ఇన్‌పుట్స్, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌తో ఉత్పత్తిదారుల సంస్థ ముందుకెళుతుందని చెబుతూ ప్రస్తుతం ఏడాదికి 17 టన్నుల వరకు మార్కెటింగ్‌కు అవకాశం ఉందన్నారు. జిల్లా ఉద్యాన అధికారి ఎస్.సుజాత మాట్లాడుతూ, మారుతున్న వ్యవసాయ పరిస్థితుల నేపథ్యంలో రైతులు కలసికట్టుగా సేద్యం చేయటమే ఉత్తమం అన్నారు. జిల్లాలో అయిదు రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ప్రోత్సాహకాలను అందించినట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి, గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక, తెనాలి మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ అవుతు సీత, అభ్యుదయ రైతు శివరామిరెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధి కుమారస్వామి, ఏడీఏ వెంకట్రావు మాట్లాడారు. ఇదే వేదికపై ప్రకృతి వ్యవసాయ రైతులకు ప్రశంసాపత్రాలను ఎమ్మెల్యే శివకుమార్ ప్రదానం చేశారు. రబీ తర్వాత వేసవిలో నవధాన్యాల సాగు ఆవశ్యకత కరపత్రాన్ని ఆవిష్కరించి, రైతులకు నవధాన్యాల కిట్లను అందజేశారు. శ్రేష్ట ఫామ్స్ ఛైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి, డైరెక్టర్లు ఉయ్యూరు సాంబిరెడ్డి, బొంతు గోపాలరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నెర్ల జ్యోతి పర్యవేక్షించారు.

అందరి నినాదం 'మా నమ్మకం నువ్వే జగన్'

వాడవాడలా విస్తృతంగా 'జగనన్నే మా భవిష్యత్'



11వ వార్డులో బుక్‌లెట్ అందజేస్తున్న కౌన్సిలర్ రత్నాకుమారి, నాయకుడు హరీష్

తెనాలిఅర్బన్: జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం బుధవారం తెనాలిలో ఉత్సాహంగా కొనసాగింది. పట్టణంలోని దాదాపు అన్ని వార్డుల్లో కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. అలాగే వారినుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. 11 వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కఠారి రత్నకుమారి, నాయకులు కఠారి హరీష్‌లు గృహసారథులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. అలాగే 17వ వార్డులో పార్టీ తెనాలి పట్టణ కన్వీనర్ మన్నవ ప్రభాకర్, సచివాలయ కన్వీనర్‌లు కోలా వాసు, బిట్రా అంజలి, గృహసారధి కొప్పుల నాగలక్ష్మిలు వార్డులోని ప్రతి ఇంటికి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. అలాగే ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్‌లను అంటించారు.

పైపులైను విషయంలో ఘర్షణ

తెనాలిరూరల్: పైపులైను విషయంలో ఘర్షణ జరగ్గా, వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం కోపల్లె గ్రామానికి చెందిన ముసునూరి విజయకుమారి కుటుంబం బుధవారం తమ ఇంటి ముందుగా పైపులైను వేసుకుంటుండగా వీరి పక్క ఇంట్లో నివసించే విజయ్ వీరితో ఘర్షణ పడ్డాడు. విజయ్ తమపై దౌర్జన్యం చేశారని విజయకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో యువకుడి అరెస్ట్

తాడేపల్లిరూరల్ : గంజాయి కేసులో ఉండవల్లి సెంటర్‌కు చెందిన ఓ యువకుడిని బుధవారం తాడేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శేషగిరిరావు కథనం ప్రకారం ఉండవల్లి సెంటర్ జాయిల్‌తోటకు చెందిన పాందలి వేణుగోపాలరావు (వేణు) చదువు మానేసి వ్యసనాలకు బానిసయ్యాడు. గంజాయి తాగుతూ, విక్రయిస్తూ ఉంటున్నాడు. తాడేపల్లి క్రైం బ్రాంచ్ పోలీసులు డొంకరోడ్లలో తనిఖీలు చేస్తున్న నేపథ్యంలో ఉండవల్లి శ్మశానం వెనుక భాగంలో తమను చూసి పారిపోతున్న వేణుగోపాలరావును అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేయగా గంజాయి తాగుతున్నానని, భయమేసి పారిపోయినట్లు వెల్లడించాడు. గంజాయి ఎక్కడిదని అడగ్గా ఏజెన్సీ ఏరియా నుంచి తీసుకు వచ్చానని చెప్పాడు. ఆ గంజాయిని తన ఇంటి వెనుక ఓ మర్రిచెట్టు తొర్రలో పెట్టి అమ్ముతున్నట్లు అంగీకరించాడు. దీంతో అతని వద్ద కేజీన్నర గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశామని, కోర్టుకు హాజరుపరిచామని సీఐ శేషగిరిరావు వివరించారు.

పసుపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి



మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: పసుపు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సత్వరమే మార్క్‌ఫెడ్‌తో కొనుగోలు కేంద్రాలను ప్రారంభింపజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే 25 శాతం పంటను రైతులు అమ్ముకున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కటువు వేసిందనే పేరుతో వ్యాపారులు క్వింటాలు కేవలం రూ.4000–4500లకు కొనుగోలు చేశారన్నారు. కేంద్రప్రభుత్వం పసుపునకు మద్దతు ధర ప్రకటించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.6,850 ప్రకటించినా, మార్కెట్లో కనీస మద్దతు ధరకు కొనే నాథుడే లేక పసుపు రైతులు నష్టపోతున్నారని విచారం వ్యక్తంచేశారు. పసుపు, జొన్న, మొక్కజొన్న పంటలను దళారులకు అమ్ముకుని నష్టపోవద్దంటున్న ప్రభుత్వం, రైతుల్నుంచి కొనుగోలుకు తానే రంగంలోకి దిగాలని శివసాంబిరెడ్డి విజ్ఞప్తి చేశారు. వీరితో జిల్లా కమిటీ సభ్యుడు ముద్దన సాంబశివరావు, సీఐటీయూ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి, ఎం.పూర్ణిమ ఉన్నారు.

నర్సరీలకు అనుమతులు లేకుంటే చర్యలు



తాడికొండ: నర్సరీలకు అనుమతులు లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఉద్యాన అధికారులు హెచ్చరించారు. తాడికొండ నియోజకవర్గంలో నారు పెంపకం చేపడుతున్న పలు నర్సరీలను బుధవారం ఉద్యాన అధికారులు పరిశీలించారు. తాడికొండ మండలం బండారుపల్లి, మేడికొండూరు మండలం మందపాడు, పేరేచర్ల గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఉద్యాన అధికారి బి.అశోక్ రెడ్డి మాట్లాడుతూ నర్సరీలకు ఉద్యాన శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన నారును అందించాలని, అధిక ధరలకు అమ్మరాదని ఆదేశించారు. నారు పెంచేందుకు తప్పనిసరిగా సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. నారు పెంచే సమయంలో గ్రామంలోని రైతు భరోసా సిబ్బంది తప్పనిసరిగా పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఈ తనిఖీలలో ఉద్యాన సహాయకులు శ్రీ విద్య, నివాస్, లలితారాణి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



వైద్యశాల సిబ్బందితో మంటలను అదుపు చేయిస్తున్న అగ్నిమాపక అధికారులు

తెనాలిరూరల్: తెనాలి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం స్థానిక కొత్తపేటలోని అగ్నిమాపక కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి ఎలక్ట్రికల్ వస్తువులు, వంటగది, వైద్యశాలు, హోటళ్లు, పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాలు, నివారణ జాగ్రత్తల గురించి మైకు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రకాశం రోడ్డులోని హెల్త్ హాస్పటల్‌లో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. సహాయ జిల్లా అగ్నిమాపకాధికారి కె.కృష్ణారెడ్డి నేతృత్వంలో మాక్ డ్రిల్ ద్వారా ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. సిబ్బందితో హాస్పటల్ యాజమాన్యానికి, సిబ్బందికి అగ్ని ప్రమాదాల మీద అవగాహన కల్పించి అనుకోకుండా ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వేసవిలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కృష్ణారెడ్డి సూచించారు.

ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



మంగళగిరి: ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాలు జరిగితే ప్రాణనష్టం ఎక్కువగా ఉంటుందని, అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని రీజినల్ ఫైర్ అధికారి ఎంఏ జిలానీ తెలిపారు. చినకాకాని ఎన్నారై ఆసుపత్రిలో బుధవారం అగ్ని ప్రమాద నివారణ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం చోటు చేసుకున్నప్పుడు తొక్కిసలాట జరగకుండా ప్రాణాలను రక్షించడంతోపాటు పై అంతస్తులోని వారిని మెట్ల మార్గం ద్వారా ఎలా కిందికి తీసుకురావాలనే విషయంపై వివరించారు. మంగళగిరి అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ



ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలో రంజాన్ మాసం సందర్భంగా మండల పరిషత్ కో–ఆప్షన్‌మెంబర్ షేక్.సుభాని ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా పాల్గొని చీరలు పంపిణీచేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ షేక్.సుబాని, షేక్.బాబు, సుల్తాన్‌బుడే పాల్గొన్నారు.

ఆంధ్ర నందుల హైజాక్‌ను అంగీకరించం

మా–ఏపీ, ఆంధ్ర ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నేతలు



మాట్లాడుతున్న దిలీప్‌రాజా. పక్కన మధుమోహనకృష్ణ, విజయభాస్కర్

తెనాలి: ప్రతిష్టాత్మకమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డులను ప్రైవేటు సంస్థలు హైజాక్ చేయడాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా, ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అంబటి మధుమోహన్ కృష్ణ స్పష్టం చేశారు. రెండు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రత్న ఫారోచ్యున్ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1964లో సినిమాటోగ్రఫీ చట్టం కింద సినిమా రంగానికి నంది అవార్డులను ఇవ్వడం ఆరంభించినట్టు గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తదుపరి తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో 'సింహ' పేరును ప్రకటించిందని తెలిపారు. ఇటీవల తెలంగాణ, ఏపీకి చెందిన రెండు సంస్థలు నంది అవార్డులను ప్రదానం చేయనున్నట్టు ప్రకటించుకోవటం దారుణమన్నారు.

ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే జరపాల్సిన నంది అవార్డుల పండగను ప్రైవేటు సంస్థలు నిర్వహించటం ఏమిటని ప్రశ్నించారు మధుమోహన్ కృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు సంస్థలు నంది పేరును ఉపయోగించకుండా తగిన జీవోను తీసుకురావాలని ప్రభుత్వాన్ని, చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థకు విజ్ఞప్తి చేయనున్నట్టు తెలిపారు. నంది అవార్డులను ప్రకటించిన సంస్థలు తమ నిర్ణయంపై పునరాలోచన చేయాలని సూచించారు. రాష్ట్రప్రభుత్వం ఒక కమిటీని నియమించి నంది అవార్డులను ప్రదానం చేయాలని కోరారు. వీరితో దర్శకుడు కపిల సుబ్బారావు, నటులు వేమూరి విజయభాస్కర్, మిలటరీ ప్రసాద్, పిచ్చిరెడ్డి ఉన్నారు.

23 నుంచి సాయి మంజీర నృత్యోత్సవాలు



పాత గుంటూరు: అంతర్జాతీయ నృత్య దినోత్సవం పురస్కరించుకుని బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై ఈ నెల 23వ తేదీ నుంచి 29 వరకు మహా మంజీరనాదం పేరుతో నృత్యోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. నృత్య పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో నృత్యోత్సవాల ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 23న డాక్టర్ కొండపర్తి వనజా ఉదయ్‌కు పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కార ప్రదానం, వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శనలు, 24న కేంద్ర సంగీత నాటక అకాడమీ ముఖ్య సలహాదారు వేదాంతం రామలింగశాస్త్రికి ఆత్మీయ సత్కారం, కళాకారుల నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. 25, 26 తేదీల్లో యువ కళారత్న పురస్కార గ్రహీతల నృత్య ప్రదర్శనలు, 27న ప్రొఫెసర్ భాగవతుల సేతురామ్‌కు పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కార ప్రదానం, కళాకారుల నృత్య ప్రదర్శనలు, 28న అభినవ సత్యభామ కళాకృష్ణకు అక్కిరాజు మణిప్రియ స్మారక సాత్రాజితి పురస్కార ప్రదానం, నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. 29న ఉదయం 9 గంటలకు పద్మావతి కల్యాణ వేదికపై ప్రపంచ నృత్య దినోత్సవం, కళాకారుల నృత్య ప్రదర్శనలు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత డాక్టర్ కృష్ణకుమార్‌కు పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారం అందించి సత్కరిస్తున్నట్లు సుబ్రహ్మణ్యం వివరించారు.

బైక్ మాయంపై కేసు

తెనాలిరూరల్: బైక్ అపహరణపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్ సుందరయ్యనగర్‌కు చెందిన మల్లెల అమృతయ్య ఈ నెల 2వ తేదీన తన బైక్‌ను మార్కెట్ ఏరియాలోని దుకాణం ఎదుట ఉంచి లోపలికి వెళ్లి రాగా వాహనం కనబడలేదు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.